# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 05 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## స్థానిక ఎన్నికలకు ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. పౌరులు ఎన్నికల సమాచారానికి, ఫిర్యాదులకు లేదా ఇతర సంబంధిత అంశాలపై వివరాలు తెలుసుకోవడానికి 9240021456 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో 565 జెడ్పీటీసీ స్థానాలు, 5,749 ఎంపీటీసీ స్థానాలు, 12,733 గ్రామ పంచాయతీలు మరియు 1,12,288 వార్డుల కోసం ఎన్నికలు జరగనున్నాయి.

మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు ఐదు దశల్లో నిర్వహించబడనున్నాయి. ఇందులో తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, మిగతా మూడు దశల్లో సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తొలి విడత అక్టోబర్ 23న, రెండో విడత అక్టోబర్ 27న జరుగుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న పోలింగ్ జరగనుంది. ప్రతి విడత పోలింగ్ పూర్తి అయిన వెంటనే ఫలితాలను ప్రకటించేలా ఏర్పాట్లు ఉన్నాయి.

# మావోయిస్టులతో చర్చల్లేవు..

- లొంగితేనే పునరావాసం
- 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితం అవుతుంది
- బస్తర్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్రం దృష్టి
- శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- హెూంమంత్రి అమిత్ షా



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మావోయిస్టులపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి నేపథ్యంలో మావోయిస్టుల్లో లొంగుబాటు అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో హెూంమంత్రి స్పష్టంగా పేర్కొన్నారు. మావోయిస్టులతో ఇకపై ఎలాంటి చర్చలు జరపబోమని, వారు ఆయుధాలు వదిలి లొంగిపోవాల్సిందే అని తేల్చి చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "లొంగిపోయే మావోయిస్టులను ప్రభుత్వం స్వాగతిస్తుంది. వారికి పునరావాసం, జీవనోపాధి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందిస్తాం" అని అన్నారు. "2026 మార్చి 31 నాటికి దేశాన్ని పూర్తిగా మావోయిస్టు రహితంగా మార్చడం లక్ష్యం. దేశం నుంచి ఎర్రదెయ్యం ప్రభావాన్ని పూర్తిగా తొలగిస్తాం" అని స్పష్టం చేశారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని వచ్చిన వార్తలపై స్పందిస్తూ, "ఇప్పుడు వారితో మాట్లాడాల్సిన అవసరమే లేదు. వారు ఆయుధాలు వదిలి ప్రధాన ప్రవాహంలోకి రావాలి" అని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడుతూ, బస్తర్ సహా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. "దేశ శాంతి భద్రతకు విఘాతం కలిగించే వారిపై భద్రతా దళాలు కఠిన చర్యలు తీసుకుంటాయి" అని హెూంమంత్రి హెచ్చరించారు.

# ఆర్టీసీకి రూ.110కోట్ల ఆదాయం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా టీజీఎస్‌ఆర్టీసీకి రూ.110 కోట్ల మేర ఆదాయం సమకూరి నట్టు యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సారి 7,754 ప్రత్యేక బస్సులు నడపాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆశించిన మేర ప్రయాణికులు లేకపోవడంతో 5,300 వరకు మాత్రమే తిప్పినట్టు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లో ఈసారి 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేశారు. గతేడాది ఇదే సీజన్‌లో 6,300 ప్రత్యేక బస్సులు నడపగా.. రూ.114 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాదితో పోల్చితే ఈసారి సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణి కుల సంఖ్య తక్కువగా ఉందనీ, కొందరు ప్రయివేటు వాహనాలనూ ఆశ్రయించినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి ఈ నెల 5, 6వ తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని సంస్థ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకునేందుకు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చర్యలు చేపట్టినట్టు తెలిపింది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో 6 డిపోల పరిధిలో 265 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. ఈ ఏడాదిలో మరో 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో డిపోలో రూ.8 కోట్ల వ్యయంతో పూర్తిస్థాయిలో ఛార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను టీజీఎస్పీడీ సీఎల్, ట్రాన్స్‌కో ద్వారా నిర్మించింది. రాబోయే 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో ఛార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. అలాగే, ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్తగా 10 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ.392 కోట్ల మేర వ్యయమవుతుందని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని సంస్థ వసూలు చేయనుంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీని సంస్థ విధించనుంది. అలాగే మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీని వసూలు చేయనుంది. హైదరాబాద్ సిటీ బస్సుల్లో ఈ అదనపు చార్జీ అమలు ఈ నెల 6 (సోమవారం) నుంచి అమల్లోకి వస్తుంది.

# అన్‌క్లెయిమ్డ్ నగదు రూ.1.84 లక్షల కోట్లు



- మూడు నెలల్లో అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలి
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా బ్యాంకులు, బీమా సంస్థలు, షేర్ మార్కెట్ నియంత్రణ సంస్థలు, ప్రావిడెంట్ ఫండ్ వంటి విభాగాల్లో ఎవరూ క్లెయిమ్ చేయని నగదు మొత్తం రూ.1.84 లక్షల కోట్లుగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ మొత్తాన్ని సరైన లబ్ధిదారులకు చేరేలా మూడు నెలల్లోపే చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

గుజరాత్‌లోని గాంధీనగర్‌లో శనివారం ప్రారంభమైన 'మీ సొమ్ము మీ హక్కు' కార్యక్రమాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ఆర్థిక మంత్రి కనుభాయ్ దేశాయ్, బ్యాంకుల ప్రతినిధులు, ఆర్థిక మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఆర్థిక మంత్రి మాట్లాడుతూ, "అవగాహన, ప్రచారం, యాక్షన్ ఈ మూడు అంశాలపై కేంద్రీకరించి పని చేస్తేనే అన్‌క్లెయిమ్డ్ సొమ్ము సరైన లబ్ధిదారులకు చేరుతుంది" అని తెలిపారు. బ్యాంకు డిపాజిట్లు, బీమా పాలసీలు, ప్రావిడెంట్ ఫండ్, షేర్ల రూపంలో ఉండే ఈ నగదు మొత్తం ప్రస్తుతం బ్యాంకులు, ఆర్‌బీఐ, ఐఈపీఎఫ్ వంటి సంస్థల వద్ద ఉందని చెప్పారు.

ఆమె పేర్కొంటూ, ఈ మొత్తాలు భద్రంగా ఉన్నాయని, సరైన పత్రాలు సమర్పిస్తే సంబంధిత వ్యక్తులు తమ సొమ్మును తిరిగి పొందవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వం కస్టోడియన్‌గా వ్యవహరిస్తుందని, దీర్ఘకాలంగా క్లెయిమ్ చేయకపోతే ఆ నిధులు ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు బదిలీ అవుతుంటాయని వివరించారు.

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను గుర్తించడానికి రిజర్వ్ బ్యాంక్ "ఉద్గమ్" పోర్టల్‌ను ప్రారంభించిందని ఆర్థిక మంత్రి గుర్తు చేశారు. ఈ పోర్టల్ ద్వారా పౌరులు తమ పేరుతో ఉన్న డిపాజిట్లు, నిధులను సులభంగా క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకులు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అవసరమైతే గ్రామాల్లో స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గుజరాత్ గ్రామీణ బ్యాంక్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రతి గ్రామాన్ని సందర్శించి అర్హులను గుర్తించే ప్రత్యేక కార్యక్రమం చేపడతామని తెలిపారు. దీనిపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వారిని ప్రశంసించారు.



## స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంలో పిటిషన్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్‌రెడ్డి సెప్టెంబరు 29న సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈనెల 6న పిటిషన్‌పై విచారణ జరపనుంది. స్థానిక ఎన్నికలకు ఇటీవల నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది.

## జంటనగరాల్లో ఆర్టీసీ బస్సు ఛార్జీలు పెంపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జంటనగరాల పరిధిలో నడిచే ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలను టీజీఎస్‌ఆర్టీసీ పెంచింది. ఈ మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజీల వరకు రూ.5 చొప్పున, 4వ స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీ వసూలు చేయనున్నారు. అలాగే, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ తర్వాత రూ.10 అదనంగా వసూలు చేయనున్నారు. రాబోయే రెండేళ్లలో హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల 2,800 ఎలక్ట్రిక్ బస్సులను డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఇందుకోసం పది కొత్త డిపోలు, పది ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ సదుపాయాల ఏర్పాటు, నిర్వహణకు అదనపు వ్యయాలు ఉండటం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో చార్జీల పెంపు చేయాల్సి వచ్చిందని, ప్రజలు సహకరించాలని టీజీఎస్‌ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది.

# బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిన కాంగ్రెస్



- కేసీఆర్ మీద కక్షతో ఆస్పత్రులపై పగ
- వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆస్పత్రుల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- కొత్తపేటలో టిమ్స్ ఆస్పత్రి సందర్శన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేసీఆర్ మీద కక్షతో ఆస్పత్రులపై పగ పెంచుకోవడం దారుణమని, కేసీఆర్ ప్రభుత్వంలో తలపెట్టిన నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల(టిమ్స్) నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఎల్బీనగర్‌లో కొత్తపేట టిమ్స్ ఆస్పత్రినిఎమ్మెల్యేలు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేష్, వివేకానంద్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ వందేండ్ల ముందుచూపుతో హైదరాబాద్ నలు దిక్కులా నాలుగు టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ హెల్త్ సిటీ, నిమ్స్ విస్తరణ వంటి ప్రాజెక్టులు ప్రారంభించారని తెలిపారు. కానీ చేతగాని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని రెండేండ్లుగా అర్ధాంతరంగా వదిలేసిందన్నారు. కేసీఆర్‌కు మంచి పేరు రావద్దన్న ఉద్దేశంతోనే ఆస్పత్రుల నిర్మాణాలను పూర్తి చేయకుండా అలసత్వం వహిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం భూసేకరణ, టెండర్లు, డిజైన్‌లు, నిధులు అన్నీ పూర్తిచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేండ్లలో ఐదు అంతస్తుల స్లాబులు వేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండి ఉంటే ఈ ఆస్పత్రి గతేడాదే ప్రారంభమయ్యి ప్రజలకు సేవలు అందించేదని, ఎక్కడ కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు పేరు వస్తుందోనని కావాలనే ఆస్పత్రి నిర్మాణాన్ని నిదానం చేశారన్నారు. ఇది ప్రజల ప్రాణాలతో ఆటలాడటమేనని మండిపడ్డారు. ముందు చూపు లేని మంద బుద్ధి కలిగిన నాయకులు కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు.

తెలంగాణలో పదివేల బెడ్ల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం పూనుకుంటే కాంగ్రెస్ దాన్ని అడ్డుకుంటోందని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ స్థాపనకు రూ.176 కోట్లు మంజూరు చేసి జీవో కూడా విడుదల చేసినప్పటికీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టును రద్దు చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ఇంతకుముందు మిగితా 2వ పేజీలో

# కొత్త మద్యం దుకాణాలకు 447 దరఖాస్తులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇప్పటివరకు అబ్కారీ శాఖకు 447 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే నూతన మద్యం దుకాణాల కోసం ఇటీవల ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.సెప్టెంబర్ 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. శనివారం నాటికి మొత్తం 447 దరఖాస్తులు అందాయి. సోమవారం నుంచి దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.మేడ్చల్ యూనిట్ పరిధిలోని 118 మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 20 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు సమాచారం. రిజర్వేషన్లు, గైడ్‌లైన్‌లు, నిబంధనల వివరాలను tgbcl.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఎక్సైజ్ శాఖ పేర్కొంది.

మొత్తం 2,620 మద్యం దుకాణాల టెండర్లకు అక్టోబర్ 18 చివరి గడువుగా నిర్ణయించారు. దరఖాస్తులు పూర్తయిన తర్వాత అక్టోబర్ 23న డ్రా ద్వారా లైసెన్సులు కేటాయించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు రూ.3 లక్షల డీడీ లేదా చలాన్ రసీదు జత చేయాల్సి ఉంటుంది. ఈ సొమ్ము రిఫండ్ కాని మొత్తమని స్పష్టం చేశారు. డ్రాలో లైసెన్స్ పొందిన వారు మొదటి విడత చెల్లింపులు అక్టోబర్ 23 నుంచి చేయాలి. కొత్త దుకాణాల లైసెన్స్ కాలపరిమితి డిసెంబర్ 1, 2024 నుంచి నవంబర్ 30, 2027 వరకు కొనసాగుతుంది. గౌడ కులస్థులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. ఈ రిజర్వేషన్ ప్రకారం మొత్తం 786 దుకాణాలు ప్రత్యేక వర్గాలకు కేటాయించనున్నట్లు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.



## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సానా తకైచి

**బలగం టీవి, టోక్యో**

ఆర్థిక శాఖ మాజీ మంత్రి సానా తకైచిను తమ కొత్త నేతగా జపాన్ పాలక పార్టీ శనివారం ఎన్నుకుంది. దీంతో ఆమె తొలి మహిళా ప్రధాని అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జపాన్‌ను దీర్ఘకాలంగా పాలిస్తున్న కన్జర్వేటివ్ లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ)కి తొలి మహిళా నేతగా ఎన్నికై ఆమె చరిత్ర సృష్టించనున్నారు. అంతర్జాతీయంగా చూసినట్లైతే లింగ సమానతలో జపాన్‌కు బాగా పేలవమైన రికార్డు వుంది. ఈ నేపథ్యంలో ఆమె తొలి మహిళా నేత కానున్నారు. ఎల్‌డీపీ పార్టీలో అంతర్గతంగా నిర్వహించిన ఓటులో మాజీ ప్రధాని కొయిజుమి కుమారుడైన వ్యవసాయ మంత్రి షింజిరో కొయిజుమిని ఓడించి తకైచి విజయం సాధించారు. ప్రధాని షిగెరు ఇషిబా స్థానంలో తకైచి బాధ్యతలు స్వీకరిస్తారు. దిగువ సభలో ఎల్‌డీపీనే అతిపెద్ద పార్టీ కావడం పైగా ప్రతిపక్షాలు తీవ్రంగా చీలికలు, పేలికలై వుండడంతో తదుపరి ప్రధాన పదవిని ఆమెనే వరించనుంది. శనివారం నాటి ఎన్నికల్లో జపాన్ పాలక పార్టీ తొలి మహిళా అధ్యక్షురాలైన తకైచి ఇక ఎల్‌డీపీకి నూతన శకం ఆరంభమవుతుందని వ్యాఖ్యానించారు.

# కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతల

- పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు
- 36 ఎకరాల ప్రభుత్వ భూముల స్వాధీనం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో హైడ్రా అధికారులు శనివారం ఉదయం పెద్దఎత్తున కూల్చివేతలు చేపట్టారు. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. ప్రభుత్వ స్థలంలో ఏర్పా టు చేసిన గుడిసెలను జేసీబీలతో తొలగించారు. స్థానికులు అడ్డుకోవడంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగించారు. సుమారు 36ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి హైడ్రా, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్ విలేజ్ రెవెన్యూ సర్వే నెంబర్ 59లో 36 ఎకరాల భూమి 12 మంది రైతుల ఆధీనంలో ఉంది. అయితే, ఇది ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. దాంతో 12 మంది రైతులు ఆ భూమిని గతంలో ప్రభుత్వం తమకు కేటాయించిందని రంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో రైతులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ అధికారులు హైకోర్టులో కేసు వేశారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు ఈ భూమి ప్రభుత్వానికి చెందుతుందని ఇటీవల తీర్పు వెల్లడించింది. దాంతో శనివారం ఉదయం హైడ్రా, రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. అక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడిసెలను కూల్చివేశారు. ఈ క్రమంలో అధికారులకు, స్థానికులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తమ గుడిసెలను కూల్చివేయొద్దంటూ స్థానికులు మొర పెట్టుకున్నారు. జేసీబీలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. 60 ఏండ్లుగా ఈ భూమిలో ఉన్నామని ఆందోళన చేశారు. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు ఈ భూమిని తాము స్వాధీనం చేసుకుంటున్నామని హైడ్రా, రెవెన్యూ అధికారులు స్థానికులకు వివరించే ప్రయ్నతం చేశారు. సుమారు 36ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3600కోట్లు ఉంటుందని అధికారుల అంచనా. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యక్తులు భూమిని కొట్టేయాలని ప్రయత్నం చేస్తున్నారని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమి రక్షణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

## ఓటు చోర్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టండి

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ఓటు చోర్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈనెల15లోపు పూర్తి చేసి ఏఐసీసీ కార్యాలయానికి పంపించాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన జూమ్ సమావేశంలో మాట్లాడారు. దేశంలో బీజేపీ పెద్ద ఎత్తున ఓట్ చోర్ కార్యక్రమాన్ని నిర్వహించిందని చెప్పారు. దీంతోనే బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుబంధ సంఘంగా పని చేస్తున్నదని విమర్శించారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఓట్‌చోరీ విషయంలో అన్ని రకాల ఆధారాలతో బీజేపీ బండారాన్ని బయటపెట్టారని గుర్తు చేశారు. ఎంతో పకడ్బందీగా ఆధారాలు చూపించినప్పటికీ కూడా ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. రాష్ట్రంలో సంతకాల సేకరణ కార్యక్రమానికి భారీ వర్షాలు కొంత అంతరాయం కలిగించాయని తెలిపారు. ఇప్పటి నుంచి ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టాలని సూచించారు. గ్రామానికి కనీసం వంద మందితో సంతాకలు చేయించాలని కోరారు. ఓట్‌చోరీకి బీజేపీ ఏ విధంగా పాల్పడిందో ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని కోరారు. డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఓటు చోరీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి కాంగ్రెస్ నాయకులు ఓటు హక్కు ఉన్న బూత్‌లో సంతకాల సేకరణ చేపట్టాలని సూచించారు. జూమ్ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, ఆఫీసు బేరర్లు, కార్పొరేషన్ చైర్మెన్లు, అనుబంధ సంఘాల చైర్మెన్లు, అధికార ప్రతినిధులు, జిల్లా ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. వచ్చే నాలుగు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి కొమోరిన్ ప్రాంతం వరకు తమిళనాడు అంతరభాగంగా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుండగా, తమిళనాడు తీరం వెంబడి నైరుతి బంగాళాఖాతంలో 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఉందని పేర్కొంది.

ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. సోమవారం కూడా పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వానలు పడవచ్చని వివరించింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ నాలుగు రోజుల వర్షాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గించే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.



వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తగా హైదరాబాద్‌లోని జంట జలాశయాలకు పైనుంచి చేరుతున్న వరద నీటిని ఎప్పటికప్పుడూ బయటకు వదులుతున్నారు. శనివారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి జంట జలాశయాలను సందర్శిం చారు. రెవెన్యూ, సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ఎప్పటి కప్పుడూ వరద పరిస్థితిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం చేయొద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్ర మత్తం చేయాలన్నారు. ఉస్మాన్ సాగర్(గండిపేట) రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతుండటంతో 6 గేట్లను 4 అడుగుల మేర ఎత్తిన అధికారులు 2652 క్యూసెక్కులు నీటిని మూసీలోకి వదులు తున్నారు. ప్రస్తుతం ఉస్మాన్‌సాగర్‌కు 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హిమాయత్‌సాగర్ మిగితా 2వ పేజీలో

## అమెరికాలో దుండగుడి కాల్పుల్లో హైదరాబాద్ యువకుడు మృతి

- టెక్సాస్‌లో విషాదం
- పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తుండగా పోలే చంద్రశేఖర్‌పై కాల్పులు అక్కడికక్కడే మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన ఓ తెలుగు యువకుడు టెక్సాస్‌లో దుండగుడి కాల్పులకు బలయ్యాడు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ (27) అనే యువకుడు టెక్సాస్‌లో డెంటల్ సర్జరీలో మాస్టర్స్ చదువుతున్నాడు. తన ఖర్చుల కోసం స్థానిక గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్నాడు.

వివరాల ప్రకారం, చంద్రశేఖర్ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో విధుల్లో ఉన్న సమయంలో ఓ దుండగుడు అతనిపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమారుడు దారుణంగా హత్యకు గురికావడంతో ఎల్బీనగర్‌లోని చంద్రశేఖర్ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.



**మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన హరీష్ రావు**

యువకుడు పోలే చంద్రశేఖర్ మృతి వార్త తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు శనివారం ఎల్బీనగర్‌లోని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రశేఖర్ తల్లిదండ్రులను ఓదార్చి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతదేహాన్ని త్వరగా హైదరాబాద్‌కు రప్పించేందుకు పూర్తి సహకారం అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి, మృతుడి కుటుంబానికి అండగా నిలవాలని ఆయన కోరారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయం

- హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తున్నామని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయమని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అధికార కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివద్ధి జోడెద్దుల మాదిరిగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని ఏజీ కాలని ఎక్స్ రోడ్డు, నటరాజన్ నగర్, శంకర్ లాల్ నగర్ లో రూ.2 కోట్ల 16లక్షల వ్యయంతో, యూసఫ్ గూడ డివిజన్ గణపతి కాంప్లెక్స్, సాయి మనోహర్ అపార్ట్మెంట్ వద్ద రూ.7 కోట్ల 17 లక్షల వ్యయంతో, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్, సివరేజ్ నిర్మాణా పనులకు, నాయకులు నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, అజారుద్దీన్‌తో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు



.హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా అండ్ మురుగునీటి బోర్డు నుంచి శంకర్ లాల్ నగర్ అండ్ సంజయ్ నగర్ వద్ద నీటి సరఫరా లైన్ల రీప్లేస్మెంట్, సంజయ్ నగర్, సుల్తాన్ నగర్, ఫాతిమా నగర్ వద్ద మురుగునీటి లైన్ల భర్తీ కి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ అభివద్ధికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో రూ.2.16 లక్షలతో సీసీ రోడ్లకు, కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశామని తెలిపారు రూ.54 లక్షలతో మురుగు నీటి కాలువల పునరుద్ధరణకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. దీని పక్కన ఉన్న స్థలంలో ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వాకింగ్ ట్రాక్, పిల్లల గేమ్స్ ఆడుకోవడానికి, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో 60 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. నగరంలో డబుల్ బెడ్ రూంలు పంపిణీ చేస్తున్నామని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మీర్జా రహమత్ బెగ్ ఖాద్రి ,మీర్జా రియాజ్ హాల్ హాసన్ ఎఫండీ, కౌసర్ మొహినుద్దీన్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కూడా ఛైర్మెన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ గుత్తా అమిత్ , కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్‌తోపాటు తదితర నేతలు అధికారులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎంఏఈ నేషనల్ స్టూడెంట్స్ మోటర్ స్పోర్ట్స్ కాంపిటీషన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కేటీఆర్

- అక్టోబర్ 11న కోయంబత్తూరులోని కుమారగురు ఇన్‌స్టిట్యూషన్స్ లో జరగనున్న కార్యక్రమం..



**బలగం టీవీ, కోయంబత్తూరు:**

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) కోయంబత్తూరులో జరగనున్న ఎఫ్‌ఎంఏఈ నేషనల్ స్టూడెంట్స్ మోటర్ స్పోర్ట్స్ కాంపిటీషన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం అక్టోబర్ 11వ తేదీన కోయంబత్తూరులోని కుమారగురు ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరగనుంది. మెకానికల్, ఆటోమోటివ్ ఇంజనీర్ల ఫ్రాటర్నిటీ నిర్వహిస్తున్న ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 101 కాలేజీలకు చెందిన 1300 మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు స్వయంగా రూపొందించిన వాహనాలు, అత్యాధునిక ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు.

## ముగిసిన మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు



- అధికార లాంఛనాలతో కార్యక్రమం

**బలగం టీవీ, హైదరాబాద్**

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం అధికార లాంఛనాలతో జరిగాయి. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రానికి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమాన నేతను చూసేందుకు భారీగా తరలిరాగా.. భారీ జనసంద్రం మధ్య అంతిమయాత్ర సాగింది. తుంగ తుర్తిలోని తన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు చేశారు. మండల కేంద్రంలోని దామోదర్‌రెడ్డి నివాసంలో ఆయన భౌతికకాయాన్ని పీసీసీ అధ్యక్షు లు మహేష్ కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని పరామర్శించారు. కాగా, రాంరెడ్డి దామోదర్ రెడ్డి(73) ఈనెల ఒకటో తేదీ రాత్రి తుదిశ్వాస విడిచిన విషయం విదితమే.

ఆయన మృతదేహానికి ఎమ్మెల్యేలు మందుల సామేలు, జగదీశ్‌రెడ్డి, బాలునాయక్, బత్తుల లక్ష్మా రెడ్డి, వేముల వీరేశం, జైవీర్‌రెడ్డి, యశస్విని రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకు లు హనుమంతరావు, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, కోటిరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్, వేనేపల్లి చందర్రావు, బూడిద బిక్షమయ్య గౌడ్, సూర్యాపేట జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు అనురాధ, బీసీ కమిషన్ సభ్యులు బాలలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు సరిత, తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి, జ్ఞాన్‌సుందర్, యుగంధర్, పాల్వాయి రజిని, బైరు వెంకన్న, ఇటికాల చిరంజీవి, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, గుడిపాటి నర్సయ్య తది తరులు నివాళులర్పించారు. దామోదర్‌రెడ్డి తుంగ తుర్తి నియోజకవర్గంతో పాటు సూర్యాపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం పనిచేశారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా ప్రజలకు సేవలందించారు. నాలుగు దశాబ్దాలపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారు.



## తెలంగాణ అల్లుడికి 101 వంటకాల విందులో బంపర్ ఆఫర్..

- తులం బంగారం గెలుచుకున్న నికిత్

**బలగం టీవీ, వనపర్తి**

తెలంగాణలో దసరా పండుగ సందర్భంగా అల్లుడికి ఘనంగా భోజనం పెట్టడం ఆనవాయితీ. అయితే, వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో జరిగిన ఓ సంఘటన ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక్కడ అల్లుడు కేవలం విందును ఆస్వాదించడమే కాకుండా, తన తెలివితో ఏకంగా తులం బంగారం గెలుచుకున్నాడు.

వనపర్తి జిల్లా, కొత్తకోట పట్టణానికి చెందిన గుంత సురేష్, సహన దంపతులు తమ కూతురు సింధును నికిత్ అనే యువకుడికి ఇచ్చి రెండు నెలల క్రితం వివాహం జరిపించారు. పెళ్లైన తర్వాత వచ్చిన మొదటి దసరా పండుగ కావడంతో, అల్లుడిని ఆహ్వానించి, అత్యంత ప్రేమతో ఏకంగా 101 రకాల వంటకాలతో కూడిన ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు.

విందు భోజనం అంతా సిద్ధమైన తర్వాత, అత్తమామలను సరదాగా పలకరించిన అల్లుడు నికిత్, "మీరు 101 రకాలు చేశామంటున్నారు కదా, అందులో ఒక్క వంటకం తగ్గింది అని నేను నిరూపిస్తే మీరేం ఇస్తారు?" అని అడిగాడు. అత్తమామలు కూడా అంతే సరదాగా, "ఒక్క వంటకం తగ్గినా సరే, మేం నీకు ఒక తులం బంగారం ఇస్తాం" అని బదులిచ్చారు. అత్తమామల సవాల్‌ను స్వీకరించిన నికిత్, లెక్కలు వేసి విందులో ఉన్న వంటకాలను జాగ్రత్తగా పరిశీలించాడు. ఆశ్చర్యకరంగా, విందులో నిజంగానే ఒక్క వంటకం తక్కువగా ఉన్నట్లు నిరూపించాడు. దీంతో, ఇచ్చిన మాట ప్రకారం గుంత సురేష్, సహన దంపతులు సంతోషంగా తమ అల్లుడు నికిత్‌కు తులం బంగారం బహుమతిగా ఇచ్చారు.



## బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

72 శాతం ప్రసవాలు జరిగితే, ప్రస్తుతం అవి 50 శాతానికి తగ్గిపోయాయని పేర్కొన్నారు. బస్తీ దవాఖానలకు డాక్టర్లు, సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని, పేదలకు ఆరోగ్యసేవలు దూరమవుతున్నాయని విమర్శించారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.1400 కోట్లకు చేరాయని, కంటి వెలుగు, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు నిలిపివేశారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి తిట్ల మీద ఉన్న ప్రేమ కిట్ల మీద లేదని ఎద్దేవా చేశారు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందన్నారు. ప్రభుత్వం వెంటనే వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆస్పత్రుల పనులను యుద్ధ ప్రాతిపదికన ఆరు నెలల్లో పూర్తి చేయాలని, లేకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివప్రకాష్ చందు, జలంధర్, మాజీ కార్పొరేటర్‌లు భవాని ప్రవీణ్ కుమార్, జిన్నారం విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ ఆరేకేపురం డివిజన్ అధ్యక్షుడు అరవింద్ శర్మ, చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, బిజినపల్లి వెంకటేశ్వరరావు, కొండల్ రెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్, రమేష్ ముదిరాజ్, పెద్ద ఎత్తున మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. ఇప్పటికే రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరువలో నీరు ఉండటంతో 2 గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి 2000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం హిమాయత్‌సాగర్‌కు 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆరెంజ్ అలర్ట్, వాతావరణ సూచనలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి దశలవారీగా నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.



# మహిళలు ఏ సమస్య ఉన్నా నిర్భయంగా సంప్రదించండి..

- సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు..
- పోకిరీలపై గత నెలలో 4 ఎఫ్ఐఆర్‌లు, 3 పెట్టి కేసులు నమోదు..
- మహిళలు, విద్యార్థినిలు వేధింపులకు గురైతే షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేయాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- విద్యాసంస్థలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో యాక్ట్ /లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమాలు..






**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

విద్యార్థినులు,మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు. జిల్లాలో షీ టీమ్ బృందం విద్యాసంస్థల్లో, మహిళలు పని చేసే ప్రదేశాల్లో ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

గత నెలలో షీ టీమ్ కు వచ్చిన ఫిర్యాదులలో 04 ఎఫ్ఐఆర్‌లు, 03 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థినులు,మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని సూచించారు. మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లో గాని, మరేక్కడ్కెన ల్కెంగిక వేధింపులకు గురవుతున్న, ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురవుతున్న మహిళలు, విద్యార్థునులు, బాలికలు మౌనంగా ఉండకుండా, ధ్కెర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా ఆకతయులు మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థలల్లోఎవరైనా వేధిం చిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు, పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనేజిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 ఫిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.



# బీఆర్ఎస్ కార్యకర్త వేములవాడ శ్రీనివాస్ అకాల మృతి

- పార్టీకి తీరని లోటు..
- బీఆర్ఎస్ పార్టీ అంటే ప్రాణమని చెప్పేవాడు..
- మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి మనోధైర్యం నింపిన చల్మెడ..

**బలగం టీవీ, వేములవాడ**

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త, పార్టీకి ప్రాణంగా భావించిన వేములవాడ (కమ్మరి) శ్రీనివాస్ (47) గుండెపోటుతో అకాల మరణం చెందడం పార్టీకి తీరని లోటు అని నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వార్డుకు చెందిన మాజీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ నిన్నటి రోజున గుండెపోటుతో మృతి చెందారు. శనివారం రోజున ఆయన పార్థివ దేహానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు నివాళులర్పించి, ఆయన కుటుంబానికి మనోధైర్యం నింపారు. బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, జిల్లా పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య శ్రీనివాస్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. శ్రీనివాస్ పార్టీ పట్ల చూపిన అంకితభావం ఎంతో గొప్పదని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, నాయకులు నీలం శేఖర్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, జోగిని శంకర్ తదితర బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పెండ్లయిన ఆరు రోజులకే యువతి ఆత్మహత్య

**బలగం టీవీ, జగిత్యాల**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో ఓ ప్రేమజంట వివాహం ఆరు రోజులు కూడా నిండకముందే విషాదం చోటుచేసుకుంది. భర్తతో చిన్నపాటి గొడవ అనంతరం యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి శివారులోని ఒడ్డెర కాలనీకి చెందిన బోదాసు గంగోత్రి (22), అదే కాలనీకి చెందిన అల్లిపు సంతోష్‌ను ప్రేమించింది. ఇద్దరూ పెద్దల అనుమతితో గత నెల 26న పెళ్లి చేసుకున్నారు. వివాహం అనంతరం సంతోషంగా జీవిస్తున్న దంపతులు దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 2న గంగోత్రి పుట్టింటికి చేరుకున్నారు. ఆ రోజు భోజనం సమయంలో దంపతుల మధ్య చిన్నపాటి తగవు చోటుచేసుకుంది. ఇరువురి తల్లిదండ్రులు సర్ది చెప్పడంతో సంతోష్ భార్యను తీసుకుని తిరిగి తమ ఇంటికి వెళ్లిపోయాడు. అయితే, గురువారం అర్ధరాత్రి సమయంలో గంగోత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న గంగోత్రి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్తతో జరిగిన గొడవ, అత్తింట్లో ఏదైనా జరిగినదేమోనన్న అనుమానంతో తమ కూతురు ప్రాణాలు తీసుకుందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీసులు కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# స్థానిక ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించండి..

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం గెలిపించండి..
- పార్టీ జిల్లా కార్యదర్శి ముశం రమేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు పోటీ చేస్తున్న సిపిఎం (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా – మార్క్సిస్ట్) అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. అమృత్‌లాల్ శుక్ల కార్మిక భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముశం రమేష్ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో వీలైనన్ని ఎక్కువ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో సిపిఎం పోటీ చేయనుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిపిఎం పార్టీ కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడి అనేక పోరాటాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తున్నాయని, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఏ ఒక్క పార్టీ కూడా నిజాయితీగా పనిచేసిన దాఖలు లేవని ముశం రమేష్ విమర్శించారు. ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చి, ఎన్నికలైన తర్వాత వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కేయడం పెట్టుబడిదారి పార్టీలకు ఆనవాయితీగా మారిందని దుయ్యబట్టారు.

చట్టసభల్లో కమ్యూనిస్టు పార్టీల ప్రాతినిధ్యం తగ్గిపోవడం వలనే విచ్చలవిడిగా అవినీతి రాజ్యమేలుతోందని, పేదల సమస్యలు పరిష్కారం కావడం లేదని రమేష్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూ అక్రమాలు, ఇసుక మాఫియా, ప్రకృతి సంపద దోచుకోవడం రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రశ్నించే గొంతుక లేకపోవడం వలనే అవినీతి రాజ్యమేలుతోందని, ప్రజల సమస్యలు పక్కకు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీతికి, నిజాయితీకి, క్రమశిక్షణకు మారుపేరైనటువంటి సిపిఎం పార్టీ అభ్యర్థులను ప్రజా సమస్యల పరిష్కారం కొరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రజానీకానికి విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, శ్రీరాముల రమేష్ చంద్ర, సిపిఎం నాయకులు సందుపట్ల పోచమ్మల్లు, గడ్డం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# లండన్‌లో గుండెపోటుతో తెలంగాణ విద్యార్థి మృతి

- కుటుంబంలో తీవ్ర విషాదం



**బలగం టీవీ, జగిత్యాల**

లండన్‌లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థి ఏనుగు మహేందర్ రెడ్డి (26) గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు మరియు స్వగ్రామం శోకసంద్రంలో మునిగిపోయాయి.

జగిత్యాల జిల్లా, మేడిపల్లి మండలం, దమ్మన్నపేట గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి, దాదాపు రెండు సంవత్సరాల క్రితం పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేషన్) పూర్తి చేయడానికి లండన్ వెళ్లారు. పీజీ పూర్తి చేసుకున్న అనంతరం, ఇటీవలే అతనికి వర్క్ వీసా కూడా లభించింది. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో ఉన్న మహేందర్ రెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంతో దమ్మన్నపేటలో తీవ్ర విషాదం నెలకొంది. యువకుడు, ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలనుకుంటున్న దశలో ఇలా జరగడం పట్ల తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మహేందర్ రెడ్డి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి సంబంధించిన ఏర్పాట్లలో కుటుంబం నిమగ్నమైంది. ఈ ఘటనతో దమ్మన్నపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# డీఎస్పీని సన్మానించిన మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరు గ్రామానికి చెందిన బత్తుల రవీందర్ కరుణ దంపతుల కుమారుడు శివకుమార్ ఇటీవల గ్రూప్ 1 లో డీఎస్పీగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కందికట్కూరు గ్రామ మున్నూరు కాపు సంఘ భవనంలో మండల అధ్యక్షుడు యాస తిరుపతి ఆధ్వర్యంలో సంఘ సభ్యులతో కలిసి శివకుమార్ ను ఘనంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి వ్యవసాయం చేస్తూ కష్టపడి చదివించారని పదవ తరగతి వరకు ఇల్లంతకుంట లోని ఒక ప్రైవేటు పాఠశాలలో చదివానని ఇంటర్మీడియట్, డిగ్రీ కరీంనగర్ లో చదివినా అని తర్వాత హైదరాబాదులో ఐఏఎస్ అకాడమీ చేరానని రెండుసార్లు సివిల్స్ రాశాను కొద్దిలో పోయిందని, తర్వాత గ్రూప్ 4 పరీక్షలు రాసి జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికై హైదరాబాద్ లో పని చేస్తున్నానని తెలిపాడు. ఈ కార్యక్రమంలో కందికట్కూరు గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఈర్ల కిష్టయ్య, ఉపాధ్యక్షులు బత్తుల స్వామి, క్యాషియర్ సిద్ధం కరుణాకర్, కార్యవర్గ సభ్యులు బత్తుల జోగయ్య, బత్తుల మోహన్, చదవాల సుధాకర్, పోతరాజు కనకయ్య, పేరుక సత్తయ్య, సిద్ధం మల్లేశం, పోతరాజు తిరుపతి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభం..

**బలగం టీవీ, అమరావతి**

ఏపీలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు మరో ముఖ్య సంక్షేమ పథకాన్ని విజయవంతంగా ప్రారంభించింది. 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ద్వారా రాష్ట్రంలోని 2,90,669 మంది ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని జమ చేశారు. ఈ మేరకు మొత్తం రూ.436 కోట్ల లబ్ధిని ప్రభుత్వం అందించింది. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఈ పథకాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ప్రభుత్వం పేర్కొంది. 15 నెలల కాలంలో సంక్షేమానికి లోటు లేకుండా, అభివృద్ధికి తిరుగులేకుండా పాలన అందించామనే ప్రజల ఆశీర్వాదం తమకు ఎంతో సంతృప్తినిచ్చిందని తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భవిష్యత్తులో




# ది రాజా సాబ్' డబ్బింగ్ ప్రారంభం

### సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం


**బలగం టీవీ, హైదరాబాద్**

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, విలక్షణ దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ది రాజా సాబ్' నుంచి మరో కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభమైనట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ 'పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ' తమ అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా వెల్లడించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న సినిమా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో, చిత్ర బృందం పనులను వేగవంతం చేసింది. తాజాగా ప్రారంభమైన డబ్బింగ్ కార్యక్రమాలతో ఫైనల్ ఫేజ్ వర్క్ మొదలైంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకుల నుండి మంచి స్పందనను దక్కించుకున్నది.


ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, ఆయన కుమార్తె కృతి ప్రసాద్ లు పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇందులో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ ముగ్గురు కథానాయికలుగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు బొమ్మన్ ఇరానీ, సప్తగిరి, వీటీవీ గణేష్, ప్రభాస్ శ్రీను తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కుతున్న 'ది రాజా సాబ్' ప్రభాస్ అభిమానుల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## ఓటీటీలోకి 'మిరాయ్'

**బలగం టీవీ, హైదరాబాద్**




ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'మిరాయ్' ఇప్పుడు ఓటీటీ వేదికపై ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో భారీ విజయం సాధించిన ఈ చిత్రం ఇప్పుడు జియో హాట్‌స్టార్‌లో ప్రసారం కానుంది. అక్టోబర్ 10వ తేదీ నుంచి స్ట్రీమింగ్ ప్రారంభమవుతుందని ప్లాట్‌ఫామ్ తమ అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా ప్రకటించింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రం అందుబాటులోకి రానుంది. తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించగా, చిత్రాన్ని కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పురాణ గాథలు, దైవశక్తులు, ఆధునిక సాహసాలు కలిసిన కథాంశంతో కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా మలిచారు. సామ్రాట్ అశోక్ కాలం నాటి దైవశక్తి, తొమ్మిది గ్రంథాలు, వాటి రక్షకులు, మానవ లోభం మధ్య సాగే యుద్ధం ఈ కథకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలు, అద్భుత విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ప్రేక్షకులను ఆకట్టుకున్న అంశాలుగా నిలిచాయి. ఓటీటీలో కూడా ఈ మాంత్రిక అనుభూతిని మరోసారి ఆస్వాదించేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు 'ది గర్ల్‌ఫ్రెండ్'

- **రష్మిక మందన్నా లేడీ ఓరియెంటెడ్ చిత్రం**
- **దీక్షిత్ శెట్టి హీరోగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం**

**బలగం టీవీ, హైదరాబాద్**

వరుస బ్లాక్‌బస్టర్ చిత్రాలతో దూసుకెళ్తున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ఇప్పుడు మహిళా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' పేరుతో రూపొందుతున్న ఈ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో బిజీగా ఉంది. తాజాగా చిత్రబృందం సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. నవంబర్ 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే సందర్భంలో ఒక కొత్త టీజర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో రష్మికకు జోడీగా దీక్షిత్ శెట్టి నటిస్తున్నారు. టీజర్‌లో వారి కెమిస్ట్రీ ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి హైప్‌ను సృష్టించింది. కథలో రష్మిక పాత్ర ప్రత్యేకత, భావోద్వేగం, ఆధునిక స్త్రీ ఆత్మవిశ్వాసం చుట్టూ సాగే కథాంశంగా తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ గీత ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. యానిమల్, పుష్ప 2, ఛావా విజయాల తర్వాత రష్మిక ఈ చిత్రంతో వేరొక దిశలో తన ప్రతిభను ప్రదర్శించబోతోంది. ప్రేక్షకుల్లో ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# మూడు రోజుల్లోనే ముగించారు

- **వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో భారత్ గెలుపు**
- **4 వికెట్లు తీసిన జడేజా**
- **రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 7 వికెట్లు పడగొట్టిన మహమ్మద్ సిరాజ్**



**బలగం టీవీ, అహ్మదాబాద్**

హోమ్ టెస్ట్ సీజన్‌ను టీమిండియా ఘన విజయంతో ప్రారంభించింది. అహ్మదాబాద్‌లో శనివారం ముగిసిన తొలి టెస్ట్‌లో భారత జట్టు ఇన్నింగ్స్ మరియు 140 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

రెండో ఇన్నింగ్స్‌లో 286 పరుగుల భారీ లోటుతో బ్యాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్



45.1 ఓవర్లలో కేవలం 146 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ ఇన్నింగ్స్‌లో అలిక్ అథనాజే (74 బంతుల్లో 38) మరియు జస్టిన్ గ్రీవ్స్ (52 బంతుల్లో 25) మాత్రమే కొంత ప్రతిఘటన చూపగలిగారు.

భారత బౌలర్లలో రవీంద్ర జడేజా అద్భుతంగా బౌలింగ్ చేస్తూ 4 వికెట్లు (4/54) పడగొట్టాడు. మహమ్మద్ సిరాజ్ 3 వికెట్లు (3/31) తీయగా, కుల్దీప్ యాదవ్‌కు 2 వికెట్లు, వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ దక్కింది. పూర్తిగా ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది.

మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. జస్టిన్ గ్రీవ్స్ (32), షై హోప్ (26), రోస్టన్ ఛేజ్ (24) తక్కువ స్కోర్లు సాధించారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ 4 వికెట్లు తీయగా, జస్ప్రీత్ బుమ్రా 3 వికెట్లు, కుల్దీప్ యాదవ్ 2 వికెట్లు, వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీశారు.

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఘనంగా రాణించింది. 128 ఓవర్లలో 448/5 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. కేఎల్ రాహుల్ (100), ధ్రువ్ జురెల్ (125), రవీంద్ర జడేజా (104 నాటౌట్) సెంచరీలతో సత్తా చాటగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (50) హాఫ్ సెంచరీ సాధించాడు. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్ (2/90) రెండు వికెట్లు తీశాడు.

ఈ విజయంతో భారత్ తన హోమ్ టెస్ట్ సీజన్‌ను శుభారంభం చేసింది. జడేజా, సిరాజ్ అద్భుత ప్రదర్శనతో టీమిండియా మరోసారి తన బౌలింగ్ శక్తిని చాటింది. ఈ గెలుపుతో రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య రెండో, చివరి టెస్ట్ మ్యాచ్ అక్టోబర్ 10 నుంచి ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనుంది.

# వన్డేలకు శుభమన్ గిల్.. టీ20లకు సూర్యకుమార్



- **ఆస్ట్రేలియా టూర్‌కు భారత జట్టు ఎంపిక**
- **రోహిత్ శర్మ, కోహ్లీలకు వన్డే జట్టులో చోటు**
- **తొలిసారిగా భారత వన్డే టీమ్‌కు ఎంపికైన తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి**
- **ఆసీస్ తో ఈ నెల 19 నుంచి వన్డే సిరీస్**
- **అక్టోబరు 29 నుంచి టీ20 సిరీస్**

**బలగం టీవీ, ముంబై**



ఆస్ట్రేలియాతో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌ల కోసం భారత క్రికెట్ జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. వన్డే జట్టుకు యువ బ్యాట్స్‌మన్ శుభమన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనుండగా, టీ20 సిరీస్‌కు స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యం వహించనున్నాడు. వన్డేల్లో సీనియర్ ఆటగాళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు మళ్లీ అవకాశం లభించింది. ఈ సిరీస్‌లో వారు జట్టుతో కలిసే ఆడనున్నారు. వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ను నియమించారు. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.

వన్డే జట్టులో నితీశ్ రాణా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ కృష్ణ, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ లాంటి ఆటగాళ్లు ఉన్నారు. వేగం బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను ఈ సిరీస్‌కు విశ్రాంతి ఇచ్చారు.

**టీ20 జట్టు ప్రకటించిన బీసీసీఐ**

టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌ను, ఆయనకు సహాయ సారథిగా అక్షర్ పటేల్ను నియమించారు. ఆ జట్టులో అభిషేక్ శర్మ, శుభమన్ గిల్, తిలక్ వర్మ, నితీశ్ రాణా, శివం దూబే, జితేశ్ శర్మ, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, సంజూ సాంసన్, బుమ్రా ఉన్నారు.

**షెడ్యూల్ వివరాలు**

వన్డే సిరీస్ అక్టోబర్ 19 నుంచి ప్రారంభంకానుంది.

మొదటి వన్డే – అక్టోబర్ 19, పెర్త్
రెండో వన్డే –అక్టోబర్ 23, అడిలైడ్
మూడో వన్డే–అక్టోబర్ 25, సిడ్నీ

**తదుపరి టీ20 సిరీస్ అక్టోబర్ 29న ప్రారంభమవుతుంది.**

1వ టీ20 –అక్టోబర్ 29, కాన్‌బెరా
2వ టీ20–అక్టోబర్ 31, మెల్‌బోర్న్
3వ టీ20 –నవంబర్ 2, హోబార్ట్
4వ టీ20–నవంబర్ 6, గోల్డ్ కోస్ట్
5వ టీ20–నవంబర్ 8, బ్రిస్బేన్

ఈ సిరీస్‌లతో భారత జట్టు వచ్చే ఏడాది జరిగే ప్రధాన ఐసీసీ టోర్నీలకు సన్నద్ధం అవ్వనుంది. యువ ఆటగాళ్లకు ఇది తమ ప్రతిభను చాటుకునే మంచి అవకాశంగా మారనుంది.

## డిసెంబర్ 5న థియేటర్లలో 'అఖండ 2: తాండవం'

**బలగం టీవీ, హైదరాబాద్**

'అఖండ 2: తాండవం' సినిమా విడుదల తేదీ అధికారికంగా ప్రకటించబడింది. మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా ఓ క్రొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉందని చిత్ర వర్గాలు వెల్లడించాయి. విడుదల పోస్టర్‌లో బాలకృష్ణ పొడవాటి జుట్టు, గడ్డంతో, రుద్రాక్షమాలలు ధరించి, త్రిశూలం పట్టుకున్న అఘోర లుక్‌లో కనిపించారు. వెనుక మంచుతో కప్పబడ్డ బ్యాక్‌డ్రాప్‌తో ఆయన లుక్ మరింత శక్తివంతంగా కనిపిస్తూ పోస్టర్‌ను ప్రత్యేకంగా మార్చింది.

